# ఆడ గుమాస్తా

దాదాపు కోలహాలంగా ఉంది ఆఫీసంతాను...

ఆ వేళ ఆఫీసరు కేంపుకెళ్ళేడన్నది ఆ కోలహాలానికి ఒక కారణమైతే - ఆ మధ్యాహ్నం టపాలులో ఆ ఆఫీసులో పని చేస్తోన్న ఇద్దరు గుమాస్తాలకి బదిలీ ఉత్తర్వులు రావడం మరొక కారణం...

గుమాస్తాలు కానీ, టైపిస్టు కానీ, ఎవరి సీట్లలో వాళ్ళు లేనే లేరు. అందరూ బదిలీ అవబోతున్న గుమాస్తాలిద్దరి టేబుళ్ళ ముందు గుంపుగా చేరి ఒకటే గప్పాలు కొట్టేస్తున్నారు.

అయితే హెడ్ గుమాస్తా అనే ప్రాణిమాత్రం ఇవేవీ పట్టించుకోకుండా తన ఫైళ్ళేవో రాసేసుకుపోతున్నాడు. అతనికి ఉన్న ఒకే సుగుణం ఆఫీసులో ఎవర్నీ పల్లెత్తుమాట అనకపోవడం. అతనికి కోపంవస్తే ఫైళ్ళు గట్టిగా చదివి కసి తీర్చుకుంటాడు. ఆగ్రహం వస్తే గొణుగుతూ ఫైళ్ళు రాస్తాడు. సంతోషం వేస్తే పొద్దుతిరుగుడు పువ్వంత చేసుకున్న మొహంతో ఫైళ్ళకి డ్రాఫ్ట్ డిక్టేట్ చేస్తాడు. ఒక్క మాటలో చెప్పాలంటే "ఫైళ్ళేరా జీవితం ... ఫైళ్ళేరా శాశ్వతం!" అన్న తత్వం గల మనిషి!

"ఏం సార్! హెడ్ గుమాస్తా గారూ! ఏంది మీరు ఉలకరూ పలకరూ!" అన్నాడు సీతారాం అనే 'డి' గుమాస్తా.

"ఏమప్పా!" అన్నాడు హెడ్‌గుమాస్తా తల ఎత్తకుండానే -

"సార్! ఈ రోజు కూడా మీరు..." అన్నాడు డేవిడ్ అనే 'ఎఫ్' గుమాస్తా. డేవిడ్ మొహంలో ఇంకా లేతదనం పోలేదనిపిస్తుంది.

"ఏమండీ? ఏమిటీ?" అంటూ ప్రశ్నార్థకంగా డేవిడ్ వైపు చూశాడు హెడ్ గుమాస్తా.

"ఈ ఆఫీసులో ఇద్దరు సీనియర్ గుమాస్తాలు ట్రాన్స్‌ఫర్ అయినారు కద సార్!"

అన్నాడు డేవిడ్.

"కాలేదయ్యా ... ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చాయి!" అంటూ డేవిడ్ మాటల్ని సవరించాడు హెడ్ గుమాస్తా.

"అవుననుకోండి సార్! ఆర్డర్స్ వచ్చినాయీ అంటే ఒక కాలు బయట పెట్టినట్లే కద సార్!" అన్నాడు సీతారాం.

"కానీలేండి ఉద్యోగమన్నాక ట్రాన్స్‌ఫర్ రావడమన్నది అతి మామూలు విషయం కదా!" అన్నాడు హెడ్ గుమాస్తా.

"మీరు భలే వారు సార్! ఇన్నాళ్ళూ మనమంతా ఒక కుటుంబంలో మాదిరిగా ఉన్నాము కదా! రాధాకృష్ణ గారూ, శివరాం గారూ మనల్ని విడిచి పోబోతున్నారు మరి" అన్నాడు టైపిస్ట్ బాలాజీ. 'అయితే ఏం?' అన్నట్టు చూశాడు హెడ్ గుమాస్తా.

"మేమంతా అదోలా ఫీలవుతున్నాం... మీకు అట్లా ఫీలింగు ఏమి..." అర్థోక్తిగా ఆపేశాడు సీతారాం.

"నా 28 ఏళ్ళ సర్వీసులో ఎప్పుడూ మీ అంత ఇదిగా నేను ఫీల్ కాలేదండీ! ఎందుకంటారేమో ఎవరయినా బదిలీ అయేది – ఎక్కడికవుతారూ? ఏదో ఒక ఆఫీసులోకే కదా! అంటే మీరు అన్నట్టుగానే ఏదో ఒక కుటుంబం లాంటి చోటుకే గదా! అట్లానే మనమంతా ట్రాన్స్‌ఫర్‌లు అవుతూ ఏదో ఒక చోట ఒకర్నొకరు కలుసుకుంటూ ఉంటామన్నమాట! ఏమంటావ్ శివరాం?" నవ్వుతూ శివరాంని అడిగాడు హెడ్ గుమాస్తా.

"కరెక్ట్ సార్!" అన్నాడు శివరాం.

"యువార్ రైట్ సార్!" అన్నాడు రాధాకృష్ణ.

"ఇంతకీ మీరు అదృష్టవంతులు. మీరు కోరుకున్న చోట్లకే బదిలీలు వచ్చినాయి... శివరాం! మీకు ధర్మవరం కదా!" అడిగాడు హెడ్ గుమాస్తా.

"కాదు సార్! నాకు హిందూపురం – రాధాకృష్ణకి ధర్మవరం" అన్నాడు శివరాం.

"అవునవును! నేనే కొద్దిగా కన్‌ఫ్యూజ్ అయినాను. మీ ప్లేస్‌లో భానుమూర్తి కదూ వస్తున్నది?" అన్నాడు హెడ్ గుమాస్తా.

"అవును సార్! రాధాకృష్ణ ప్లేస్‌లో కళ్యాణిని వేసినారు" అన్నాడు డేవిడ్.

"ఎవరో ఒకరు లెండి. అంతా గవర్నమెంటు పని చెయ్యడానికే కదా!" అంటూ గొప్ప సత్యాన్ని లోకానికి చాటిన ప్రవక్తలా మందహాసం చేశాడు హెడ్‌గుమాస్తా.

"ఈ ఆఫీసుకు చాలా రోజుల తర్వాత కళ రాబోతోందన్నమాట" అన్నాడు సీతారాం.

"అవును సార్! కళ్యాణి అడుగుపెట్టిందంటే ఆఫీసు అట్లే కళ కళ లాడాల్సిందే!" అన్నాడు డేవిడ్.

"అదెట్లా?" అంటూ నవ్వుతూ చూశాడు హె.గు.

"మీకు కళ్యాణి గురించి నిజంగా తెలీదా సార్!" అడిగాడు సీతారాం.

"కళ్యాణి అంటే చామన ఛాయగా కోల మొహం... పెద్ద పెద్ద కళ్ళు..." అంటూ హె.గు. అంటూ ఉంటే –

"ఆహోఁ... అచ్చంగా కవిలాగా ఎంత బాగా వర్ణించారు. అచ్చంగా ఆమే సార్ – ఆమే!"

"ఒకసారి రాఘవయ్య గారితో గొడవ పడి చెప్పు ఎత్తిన అమ్మాయే కదా!" అన్నాడు హె.గు.

"కరెక్టు సార్!" అన్నారు అంతా కోరస్‌గా.

"ఆమెకు పెళ్ళయిందా?" అడిగాడు హె.గు.

"ఆ! అయింది. ఆ మొగుడనే మహానుభావుడు ఇప్పుడు కువాయిట్‌లో ఉన్నాడు సార్! డబ్బు సంపాదన మరి!" అన్నాడు సీతారాం.

"అవును మరి పాపం!" అన్నాడు హె.గు.

"పాపం అంటారేంది సార్! స్వంత మొగుడు దేశాంతరం పోతేనేం దేశంలో మొగాళ్ళే కరువా?" అన్నాడు సీతారాం. అతని గొంతులోనే కాకుండా మొహంలోనూ, చూపుల్లోనూ, చేతుల్లోనూ వ్యంగ్యం కనిపించింది అందరికీ.

"అబ్బబ్బా! ఏం మాట్లాడతావయ్యా సీతారాం!" అంటూ ఓ మెచ్చుకోలు విసిరాడు రాధాకృష్ణ.

"అసలు ఆ కళ్యాణి రాకనే, ఇంతగా ఆమెను గురించి మాట్లాడుతున్నారే! ఆమె ఇక్కడ జాయిన్ అయితే ఒకరన్నా పని చేస్తారా అని నా అనుమానాం" అన్నాడు హె.గు.

"భలే చెప్పినారు సార్! ఆమె ఇలా వయ్యారంగా పెన్ను పట్టుకుని ఫైలు రాస్తూ ఉంటే ఒక వైపు పైట అలా జాలువారుతూ ఉంటే మనవాళ్ళంతా నోర్లు వెళ్ళబెట్టుకొని చొంగలు కారుస్తూ టేబులు చుట్టూ కూచుంటారేమో!" అంటూ శివరాం మోనో ఏక్షన్ చేసి చూపిస్తూ ఉంటే ఆఫీసంతా గొల్లుమని నవ్వింది.

"అట్లయితే ఒద్దయ్యా! ఆఫీసులో పనంతా పెండింగు పడిపోతుంది. కళ్యాణిని జాయిన్ చేసుకోవద్దని ఆఫీసరుతో చెబుతాను. ఈ ఆడవాళ్ళంటే నాకు భలే కంపరం" అన్నాడు హె.గు. అప్పుడే కంపరమెత్తినట్టు మొహం పెట్టి.

"సార్! సార్ అంత పని చేసేరు... ఆమె జాయిన్ కాకపోతే నేను రిలీవు కాలేను. నా అదృష్టం కొద్దీ నా నేటివ్ మండలానికే ట్రాన్స్ఫర్ అయింది. మా ఊళ్ళో నాకు చాలా పనులున్నాయి!" అంటూ దీనంగా మొహం పెట్టేడు రాధాకృష్ణ.

"ఊహూఁ! అట్లనా! సర్లే పాపం – కానీ ఈ డేవిడ్, సీతారాం అట్లాంటి పిల్లతో ఎట్లా వేగడం!" ఇబ్బందిగా చూస్తూ అన్నాడు హె.గు.

"ఈ పిల్లోళ్లదేముంది లెండి సార్! రెండు మూడు రోజులు నాలిక వెళ్ళబెట్టుకోని చూస్తారు. ఫోజులు కొడతారు. తర్వాత అంతా వాళ్ళకి మామూలు అయిపోతుంది"

అన్నాడు రాధాకృష్ణ.

"ఏమోనండీ! అసలు ఈ ఆడవాళ్ళని ఇట్లా ఆఫీసుల్లో చేర్చుకోకూడదు. నిజానికి వీళ్ళని ఏ ఎజుకేషన్ డిపార్టుమెంటుకో ట్రాన్స్‌ఫర్ చేయించాలి" అన్నాడు హె.గు.

"పాపం! ముసలితనం ముసురుకొస్తూ ఉంటే ఆడవాళ్ళ మీద విరక్తి కాక ఇంకేమి వస్తుంది!" అంటూ గొణిగాడు సీతారాం.

వారం రోజుల తర్వాత భానుమూర్తీ, కల్యాణీలు వచ్చి ఆ ఆఫీసులో జాయిన్ కావడం, రాధాకృష్ణ, శివరాంలు రిలీవ్ అయిపోవడం జరిగాయి.

ఆఫీసు వాతావరణం దాదాపు మారిపోయిందనే చెప్పాలి.

మునుపు ఎడ్డీ మడ్డీగా ఆఫీసుకు హాజరవుతున్న గుమాస్తాలు చక్కగా దువ్వుకుని వస్తున్నారు. గడ్డం ఏ మాత్రం పెరగనీయకుండా రోజూ షేవ్ చేసుకుంటున్నారు. నాలుగయిదు రోజులకోమారు బట్టలు మార్చని వాళ్ళు కూడా రోజుకో జత బట్టలు మార్చేస్తున్నారు. అడపాదడపా వాటికి ఖరీదయిన సెంట్లను ఒకరిద్దరు పులుముకుని వస్తున్నారు.

సహజంగానే కళ్యాణికి సెన్సాఫ్ హ్యూమర్ ఉందేమో చిన్న జోకు నయినా రిసీవ్ చేసుకుని హాయిగా నవ్వేస్తుంది. అందుకే దిక్కుమాలిన కుళ్ళు జోకుల్ని కూడా ఆమెకు వినబడేలా బిగ్గరగా వేస్తున్నారు. కళ్యాణికి నవ్వడమే పనిలా కిల కిల మంటూనే ఉంటోంది.

భానుమూర్తి మాత్రం వీళ్ళందర్లోకి భిన్నమైన మనిషి, తన పనేమో తనేమో - అతను జోకులు వేయడు. ఎవరి జోకులకీ నవ్వడు. 'చాలా రిజర్వుడు' అని తక్కిన స్టాఫంతా పసిగట్టేసింది. ఒక్క కళ్యాణి మినహా ఎవరూ అతనితో తెలియని ఆఫీసు సబ్జెక్టుల్ని చెప్పించుకోరు.

ఆరోజు కళ్యాణి ఒంట్లో బాగాలేదంటూ ఆఫీసుకి సెలవు పెట్టేసింది.

ఎవరికీ ఆఫీసులో కూచోబుద్ధవడం లేదు. ఏదయినా జోకు వేయాలన్నా అందంగా నవ్వేవాళ్ళు లేనప్పుడు జోకులెందుకు వృథా అనిపిస్తోంది అందరికీ.

"అబ్బా! ఈ వేళ చాలా ప్రశాంతంగా ఉంది ఆఫీసు!" అన్నాడు సీతారాం ఫైలు రాస్తూనే.

"ఏం ఎందుకట్లా అనిపిస్తోంది!" అన్నాడు భానుమూర్తి. అతని మొహంలో ఏ భావమూ లేదు.

"మీకు కాదు లెండి సార్! ఎవరున్నా లేకున్నా ఒకటే" అన్నాడు డేవిడ్ - సీతారాం మాటల్ని అందుకుంటూ.

"అదేమీ? నేను మీ మాదిరి గుమాస్తానే కదయ్యా. ఏమంటే సీనియర్‌ని కనుక జీతం రాళ్ళు కొన్ని ఎక్కువ రావచ్చు" అన్నాడు చిరునవ్వుతో భానుమూర్తి.

"అది కాదులేండి సార్! ఈ రోజు ఆఫీసుకి ఓ ప్రత్యేకత ఉంది - ఏమిటో చెప్పుకోండి చూద్దాం " అన్నాడు సీతారాం.

"ఏమో మరి" అన్నాడు భానుమూర్తి.

"ఈ రోజు కళ్యాణి ఆఫీసుకి రాలేదు" అన్నాడు డేవిడ్ కొంటెగా చూస్తూ.

"కర్రెక్ట్!" అన్నాడు సీతారాం.

"ఇద్దో సీతారాం! ఎప్పుడూ మాట లేనా పని చెయ్యండయ్యా పనీ!" అన్నాడు హె.గు.

"సార్ కళ్యాణి ఎన్ని రోజులు సెలవు పెట్టింది?" అడిగాడు డేవిడ్.

"ఈ రోజు మాత్రమే" అన్నాడు హె.గు.

"అయితే మాత్రమేం పని చురుగ్గా సాగుతోంది... అసలు ఈ ఆడవాళ్ళు ఉంటే ఏ పనీ చేయనివ్వరు. ఆ మహాతల్లికి ఏం వర్కు వస్తుందో ఏమో గానీ ప్రతి చిన్న రిఫరెన్సునూ 'ఇదెట్లా సార్, అదెట్ల సార్!' అని అడుగుతూనే ఉంటుంది" అన్నాడు సీతారాం.

"ఇది బ్యూటీ పార్లర్ అనుకుందేమో నీటుగా డ్రెస్ చేసుకొని, స్టైయిల్‌గా దువ్వుకొని కిలో మల్లెపూలు జడలో పెట్టుకుని వచ్చి కూర్చుంటుంది" అన్నాడు టైపిస్ట్, కలుగచేసుకుంటూ.

"అసలు మన ఆఫీసరు ఈమెని చేర్చుకోకుండా ఉండాల్సింది. ఆఫీసరయినా ఏం చేస్తాడు? ఎంతయినా మగవాడు కదా! కాస్త షోకు వొలకపోసి వయ్యారాలు పోతూ 'జాయినింగ్ రిపోర్టు ఇవ్వనా సార్!' అంటూనే 'అయిస్' అయిపోయి ఉంటాడు" అన్నాడు సీతారాం.

"ఏమన్నా చెప్పు సీతారాం! ఈ లోకం చీర కట్టుకునే ఆడదానికి దోసోహం అంటుంది" అన్నాడు డేవిడ్.

భానుమూర్తి ఇవన్నీ వింటూ అసహనంగా తన సీట్లోనే కదుల్తూ ఉన్నాడు.

"అది సరే డేవిడ్! నాకు ఒక అనుమానం. మొగుడు ఎక్కడో దేశం కాని దేశంలో ఉంటే ఇక్కడ ఈమె ఇన్ని షోకులు ఎందుకు పడుతూ ఉందో" అన్నాడు టైపిస్టు.

ఇంత చిన్న అనుమానాలకి వాళ్ళ దగ్గర జవాబు లేక కాదు. ఒక ఆడదాన్ని గురించి ఏదో ఒకటి అనుకుంటేనే 'మజా' ఉంటుందని వాళ్ళ గొప్ప నమ్మకం. ఎప్పుడూ ఏ టీ హోటల్లోనో ఎంతో మనస్ఫూర్తిగా మాట్లాడుకునే మాటలే అవన్నీను. అయినా తనివితీరదు.

హెడ్ గుమాస్తా కల్పించుకుని – "ఏమండీ సీతారాం! ఆడవాళ్ళ షోకులతో మీకేమైందండీ! ఆడవాళ్ళే ఆడవాళ్ళంట. వాళ్ళు షోకులు చేసుకోక ఇంకేం చేసుకోంటారు? ఇదీ పెద్ద ముఖ్యమైన విషయమా మీకు" అన్నాడు.

"పోండి సార్ మీదంతా మరీ! మీకు అసలు నిజం తేలీదు – తెలిసినా అర్థం చేసుకోరు. ఆడవాళ్ల షోకులు అంటూ జనరలైజ్ చేయకండి సార్!" అంటూ సీతారాం మాట్లాడుతూ ఉంటే బయట ఎవరో పిల్చినట్లయితే హెడ్ గుమాస్తా

వెళ్ళిపోయేడు.

"ఇంతకీ కళ్యాణి షోకులు ఎవరి కోసమంటావు?" సీతారాం ప్రశ్న.

"వలచిన వారి కోసం" టైపిస్ట్ జవాబు.

"భలే చెప్పావు గురో!" అన్నాడు డేవిడ్.

"నేను నా అనుభవంలో చాలా మందిని చూశాను కానీ డేవిడ్ – ఇట్లా ఉన్న పిల్లను చూడలేదప్పా!" అన్నాడు సీతారాం.

"అంటే నీకు చాలా మందితో అనుభవం..." అన్నాడు డేవిడ్.

"మరీ అంత ఇదిగా అడిగితే ఎట్లా డేవిడ్! అవన్నీ పర్సనల్ విషయాలు..." అన్నాడు సీతారాం.

"నిజంగా...ఎంత అదృష్టం సీతారాం" అన్నాడు టైపిస్ట్.

భానుమూర్తి మరోమారు కుర్చీలో అసహనంగా కదిలాడు.

"సార్! భానుమూర్తిగారూ! మీరు అట్లా ఫైలు రాసేస్తూ ఉంటే మేము ఆఫీసు వర్కు చేయలేదని గిల్టీగా ఉంది సార్! దయచేసి మీ రాతని కొంతసేపయినా పక్కకి పెట్టి కో ఆపరేట్ చేయండి!" అన్నాడు డేవిడ్.

భానుమూర్తి బలవంతంగా నవ్వుని పెదవుల మీదికి తెచ్చుకుని సీతారాంనీ, డేవిడ్ని మార్చి మార్చి చూశాడు.

"సార్! సార్! అంత వేడిగా, వాడిగా చూడకండి సార్! మేం భస్మం అయిపోగలం – మా గిల్టీ ఫీలింగు నించి గట్టెక్కిస్తే అదే చాలు" అన్నాడు డేవిడ్ నవ్వేస్తూ.

"సార్! మీరు జాయిన్ అయినప్పటి నుంచీ మాకు కాపీలు ఇప్పించలేదు. మీరు అలా వస్తే కాఫీ హోటలుకెళ్ళి వద్దాం!" అన్నాడు సీతారాం.

మారు మాట్లాడకుండా లేచి "పదండి" అన్నాడు భానుమూర్తి.

హెడ్ గుమాస్తా ఒక్కడు ఏమనాలో తెలీక "నాకు ఇక్కడికే స్ట్రాంగ్ కాఫీ పంపించండి!" అన్నాడు.

తక్కిన గుమాస్తాలూ, టైపిస్ట్ అందరూ కేంటీన్ వైపు దారి తీశారు. కేంటీన్ రద్దీగా ఉండడంతో కేంటీన్ ముందున్న కానుగ చెట్టు కిందే నిలుచున్నారు అందరూ. అక్కడికే కాఫీలు సరఫరా చేశాడు కేంటీన్ ప్రొప్రయిటరు.

"ఈ రోజు ఆఫీసరు రాకపోవడం వల్ల, కళ్యాణి సెలవు పెట్టడం వల్ల హాయిగా ఉంది సార్!" అన్నాడు సీతారాం.

"ఆఫీసరు రాకపోవడం కంటే కళ్యాణి సెలవు పెట్టడమే హాయిగా ఉంది సీతారాంకు" అన్నాడు డేవిడ్ నవ్వుతూ. సీతారాం చిరు కోపం ప్రదర్శిస్తూ డేవిడ్ పొట్టలో సున్నితంగా బొటన వేలితో నొక్కాడు.

"ఎందుకలా అనుకుంటున్నారు?" అన్నాడు భానుమూర్తి.

"ఆడవాళ్ళుంటే ఏం మాట్లాడుకుంటాం సార్! పొరపాట్న ఏ బూతుమాటో అంటామేమో అని చాలా స్పృహతో మాట్లాడాలి!" అన్నాడు టైపిస్ట్.

"అట్లనా!" అంటూ కాఫీ గ్లాసు కింద పెట్టేసి సిగరెట్టు వెలిగించుకున్నాడు భానుమూర్తి.

"మన ఆఫీసులో మీ కొక్కరికే సార్ ఈ సిగరెట్టు అలవాటు ఉండేది. ఆ దేవుడి దయవలన మాకు ఒక్క దురలవాటు లేదు సార్!" అన్నాడు సీతారాం.

"మంచిదే!" అంటూ సిగరెట్టు తాగడంలో ఉండిపోయాడు భానుమూర్తి.

"మీకు వర్కు తెలిసినంత బాగా మాకు తెలీదు సార్! మీకు డ్రాఫ్టింగ్ కెపాసిటీ బాగుంది. మీకు అన్ని సబ్జెక్టులూ అంత బాగా తెలుసు కాబట్టే కళ్యాణి ప్రతి చిన్న విషయానికీ 'భానుమూర్తి సార్! భానుమూర్తి సార్?' అంటూ కలవరిస్తుంది" అన్నాడు సీతారాం.

భానుమూర్తి కన్నుల్లో అసహనం కదిలింది.

"కళ్యాణి అంటే మీకు అంతిష్టమా!" అన్నాడు భానుమూర్తి.

"ఇష్టమా! మీరు భలే వారు సార్! ఛీ ఛీ షో కేసులో బొమ్మలా అలంకరించుకొనే మనుషులంటే మంట! దాని మొహానికి అందమా చందమా - దిష్టి బొమ్మకు చీరకట్టినట్టుంటుంది" అన్నాడు సీతారాం.

"అన్నీ సొరకాయ కోతలు - ఆమె ఇప్పుడు రమ్మంటే ఎగురుకుంటూ పోవా? భలే మాట్లాడతావు సీతారాం!" అన్నాడు టైపిస్ట్.

ఉడుక్కున్నట్టు మొహం పెట్టి "ఏం లేదు" అన్నాడు సీతారాం.

"మీకు నిజంగా ఇష్టమైతే ఒక పని చెయ్యండి. ఆమె ఒంటరిగా ఉన్నప్పుడు మీ ఇష్టాన్ని చెప్పేయండి!" అన్నాడు భానుమూర్తి.

"ఇదేంది సార్ ఇట్ల చెబుతున్నారు!" అన్నాడు సీతారాం.

"యస్ మిస్టర్ సీతారాం! ఆ అమ్మాయి అంగీకరిస్తే మంచిదే గదా!" అన్నాడు భానుమూర్తి. అతని గొంతులో హాస్యం గానీ, వ్యంగ్యం కానీ కనిపించలేదు తక్కిన ముగ్గురికీ.

"ఛ ఛ ... ఛ ... మీరు మమ్ముల్ని తప్పుగా అర్థం చేసుకొంటున్నారు సార్! ఆమె శీలం సరిగ్గా లేదన్నదే మా బాధ" అన్నాడు సీతారాం.

"నిజం సార్!" అన్నాడు డేవిడ్ 'తందాన' అంటూ వంత పాడుతూ.

"మీ కెందుకండీ బాధ?" అన్నాడు ముగ్గురిమొహాల్లోకి చూస్తూ - భానుమూర్తి.

"ఎందుకు ఉండదు సార్ బాధ - ఒకే ఆఫీసువాళ్ళం కదా!" అన్నాడు టైపిస్ట్.

"మీరు ఎక్కడో పొరబడుతున్నా రండీ! ఆ అమ్మాయి భర్త ఇక్కడ లేడు ఎక్కడో బ్రతుకు తెరువు కోసం కువాయిట్‌లో ఉన్నాడు. అట్లా ఉంటే ఇక్కడ

ఆ అమ్మాయి ఇంకెవ్వరితోనో కులుకుతోనే ఉంటుందని – అందుకే ఆమె అలా అలంకరించుకొని వస్తుందని మీ వాదన!"

"ఎగ్జాక్ట్లీ!" అన్నాడు సీతారాం.

"ఉండనీలేండీ!" అన్నాడు భానుమూర్తి.

"ఇదేం సార్ ఇట్ల మాట్లాడుతున్నారు!" టైపిస్ట్ అన్నాడు.

"అవును – ఉండనీలేండి – అది ఆమె స్వంతగొడవ...ఇందాకా ఆఫీసులో సీతారాం గారు తన గురించి కళ్యాణదుర్గంలో ఆడవాళ్ళతో తన పరిచయాలు చెప్పాడు... అది ఆయన స్వంత గొడవ! ఆ గొడవతో నాకేం పని లేదు ... అవునా ... ఆ అమ్మాయి మంచిదనే నా అభిప్రాయం. ఒకవేళ నా అభిప్రాయం పొరపాటు అయితే అవనీగాక నాకేమీ బాధ లేదు" అంటూ సిగరెట్టు చివరి పీల్పు పీల్చేసి దూరంగా గిరవాటు పెట్టాడు భానుమూర్తి.

"మీ వాదన భలే చిత్రంగా ఉంది సార్!" అన్నాడు డేవిడ్.

సీతారాం మాట్లాడకుండా ఆలోచనల్లో పడిపోయాడు.

"మిస్టర్ సీతారాం! ఏమిటీ ఆలోచిస్తున్నారు? ఆ అమ్మాయిని ఎట్లా అడుగుదామనా?" అంటూ చిరునవ్వుతో అడిగాడు భానుమూర్తి.

"ఛ .. ఛ .. అదేం లేదు సార్!" అంటూ నవ్వాడు సీతారాం.

"ఇక్కడ మీకో కథ చెబుతాను" అంటూ జేబులోంచి సిగరెట్టు పెట్టె తీసి, అందులో ఉన్న చివరి సిగరెట్టు వెలిగించుకున్నాక చెప్పడం ప్రారంభించాడు, భానుమూర్తి.

"నేను సర్వీసులో చేరిన కొత్తలో – అంటే 15 ఏళ్ళ కిందటి మాట – ధర్మవరంలో జాయిన్ అయ్యాను. అక్కడ ఒక సీనియర్ గుమాస్తా రాజగోపాల్ అని ఉండే వాడు. అతను మంచి జీనియస్. రెవిన్యూ సబ్జెక్ట్సు అన్నీ కొట్టిన పిండి. ల్యాండ్ అక్విజిషను అతని పెట్ సబ్జెక్టు – కళ్ళు మూసుకుని డ్రాఫ్టింగ్ డిక్టేట్ చేసేవాడు. నేను అతని దగ్గరే పని నేర్చుకున్నది. ఏమంటే అతనికి ఆడవాళ్ళ పిచ్చి ఎక్కువ. కొత్తగా ఎవరయినా అమ్మాయి ఆఫీసులో చేరితే ఆ అమ్మాయిని ఏదో రకంగా వలలో వేసుకొనే ప్రయత్నాలు చేసేవాడు. అయితే ఏ అమ్మాయీ అతనికి అందలేదనుకోండి. అందకున్నా వాళ్ళ మీద లెక్కలేనన్ని పుకార్లు పుట్టించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. తను నిజంగా కళ్ళతో చూసినట్టే ఆడవాళ్ళ మీద అక్రమ సంబంధాలను కల్పించేవాడు. నేను ఎప్పుడయినా అతన్ని విమర్శించినా నా మీద ఎగిరెగిరి పడేవాడు. అసలు నాకూ అతనికీ పడేది కాదు – 'నాకు ఇట్లా వగలాడులంటే గిట్టదు – నేనంతా సంసార పక్షం స్త్రీలనే వలలో వేసుకోనేది. ఇది వగలు పోతోంది – నువ్వు ట్రైచెయ్యి నీకు పడ్తుంది' అనేవాడు" అంటూ చెప్పుకుపోయాడు భానుమూర్తి.

"ఇప్పుడు ఎక్కడ ఉన్నాడు సార్?" అంటూ అడ్డు తగిలాడు సీతారాం.

"ఎక్కడా లేడు. లారీ ఆక్సిడెంటులో 8 సం.ల క్రితం చనిపోయాడు" అన్నాడు భానుమూర్తి.

"అలాగా" అంటూ నిరుత్సాహపడిపోయాడు డేవిడ్.

"ఇక్కడ ఒక షాక్ న్యూస్ చెప్పనా..." అంటూ అందరి ముఖాల్లోకి చూసి, "ఆ రాజగోపాల్ చనిపోయాక అతని కూతురు కళ్యాణికి ఉద్యోగం ఇచ్చారు జి.ఓ. కింద."

"మన కళ్యాణికా?" కోరస్‌గా అన్నారు ముగ్గురూ.

"యస్ ... మన కళ్యాణికే .." అంటూ సిగరెట్టు గుప్పు గుప్పున తాగుతూ అన్నాడు భానుమూర్తి.

*(రచన మాసపత్రిక మార్చి 94)*